క్లుప్తంగా

2కే రన్‌ను విజయవంతం చేయాలి

దామెర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2కే రన్‌ను విజయవంతం చేయాలని పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య కోరారు. శుక్రవారం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. 12వ తేదీన ఉదయం 6 గంటలకు పరకాల పట్టణంలో 2కే రన్ నిర్వహిస్తున్నామని, యువకులు, విద్యార్థులు, ఉత్సాహవంతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రథమ బహుమతిగా రూ. 5000, ద్వితీయ బహుమతి రూ. 3000, తృతీయ బహుమతి రూ.2000 అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే, నాలుగు నుంచి పదవ స్థానంలో గెలుపొందిన వారికి రూ. 1000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పరకాల సీఐ కిషన్, ఎస్సై ముత్యం రాజేందర్, ప్రశాంత్ బాబు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలి

దామెర: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన కుల వృత్తులకు రూ. లక్ష ఆర్థిక సాయం పథకం ముదిరాజ్‌లకు కూడా వర్తింపజేయాలని మెపా మండల అధ్యక్షుడు తక్కళ్ల నరేష్ శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ముదిరాజ్‌లు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే లక్షరూపాయల సాయం పథకంలో ముదిరాజ్‌లను వర్తింపజేయాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు ఆలేటి సంపత్, జనార్దన్, సునీల్ కుమార్, రావుల స్వామి, కార్తీక్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ, కాజీపేట, మడికొండ ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో దశల వారీగా ఉదయం 7.30 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈబీఎస్‌బీ ఎన్‌సీసీ క్యాంపునకు పింగిళి కళాశాల కేడెట్లు

హన్మకొండ అర్బన్: ఈనెల 10నుంచి పంజాబ్‌లోని మాలేరుకోట్లలో జరగనున్న ఏక్ భారత్.. శ్రేష్ట భారత్ (ఈబీఎస్‌బీ) ఎన్‌సీసీ క్యాంపునకు నగరంలోని పింగిళి కళాశాలకు చెందిన ఇద్దరు మహిళా కేడెట్లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. కళాశాలకు చెందిన కె.అవంతి పటేల్, ఎం.కీర్తిమాల ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ డాక్టర్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, అడిషనల్ కంట్రోలర్లు రేణుక, శిరీష, తదితరులు అభినందించారు.

సామాజిక న్యాయవేదిక జిల్లా కార్యవర్గం

ఎంజీఎం: సామాజిక కార్మిక న్యాయవేదిక వరంగల్ జిల్లా కమిటీని ఎంజీఎం ప్రాంతంలో శుక్రవారం జరిగిన కార్మికుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు యేశబోయిన సాంబయ్య సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొర్రె నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజారపు రాజేష్, ఉపాధ్యక్షుడిగా అర్సం లక్ష్మణ్, కార్యదర్శిగా హయగ్రీవాచారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని జీతాలతో జీవితం వెల్లదీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.25 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యం

నయీంనగర్: తన కొడుకు రాజేష్‌ను హత్యచేసిన నిందితులను పట్టుకోవడంలో పోలీసుల దర్యాప్తులో నిర్లక్ష్యం కనిపిస్తోందని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బాధితుడు ఆషాడపు దశరథం ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు హత్య చేసిన వారికి అదుపులోకి తీసుకుని శిక్షించాలని కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన కొడుకు రాజేష్‌ను 2018, మే 9న పెళ్లి ఊరేగింపులో అతని మిత్రులైన కొంతమంది నమ్మకద్రోహులు కూల్‌డ్రింక్స్‌లో విషం కలిపి హత్య చేశారని ఆరోపించారు.

విజయవంతం చేయాలి

మడికొండ: ఈనెల 11న కొత్తగూడెంలో జరగనున్న ప్రజా గర్జనసభను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈమేరకు ప్రజా గర్జన వాల్‌పోస్టర్లను 46వ డివిజన్ రాంపూర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి మాట్లాడుతూ ప్రజాగర్జన బహిరంగ సభకు ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.భిక్షపతి, రాంపూర్ గ్రామ కార్యదర్శి మంద సుమన్, మునిగాల ఐలయ్య, రజిత, స్వామి, ఉపేందర్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం కేసీఆర్


ఐనవోలు: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు


దామెర: గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఐనవోలు : రాష్ట్రంలోని ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మామునూరులో ప్రభుత్వం శుక్రవారం సంక్షేమ సంబురాలు నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరై నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేసిన వివిధ పథకాల ప్రగతి నివేదికను తెలిపారు. సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ఆదరించాలని కోరారు. అనంతరం మండలంలో 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ఇద్దరికి సీఎంఆర్ఎఫ్, పలువురికి డీసీసీ బ్యాంకు రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్బండవర్గాల సంక్షేమ ప్రదాత కేసీఆర్

దామెర: సబ్బండవర్గాల సంక్షేమ ప్రదాత సీఎం కేసీఆర్ అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. తెలంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సంక్షేమ సంబురాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. కేటీఆర్ కృషితో విదేశీ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు రావడంతో వేలాది మంది యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నట్లు వెల్లడించారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలు కొనసాగించిన ఘనత సీఎం కేసీఆర్‌దని పేర్కొన్నారు. ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా ప్రజలకు దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందని వెల్లడించారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా రెండో విడుత గొర్రెలు, ఇళ్ల పట్టాలు, కుల వృత్తులవారికి రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, ఏసీపీ జూపల్లి శివరామయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సోద అనిత, ఇన్‌చార్జి డీఏఓ ఉమారాణి, ఎంపీపీలు శంకర్, కళావతి, అనుసూర్య, సుమలత, జెడ్పీటీసీలు కల్పనాకృష్ణమూర్తి, ధర్మారావు, రాధిక, చిలువేరు మొగిలి, తహసీల్దార్లు ఎండీ.రియాజుద్దీన్, విశ్వనారాయణ, మహేందర్, రాజేశ్వర్ రావు, సురేష్‌కుమార్, ఎంపీడీఓలు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, వీఏఎస్ దీపిక పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆటపాటలు అలరించాయి.


శాయంపేట: చెక్కులు అందిస్తున్న గండ్ర జ్యోతి

శాయంపేటలో సంక్షేమ సంబురాలు

శాయంపేట : అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్పంచ్ కందగట్ల రవి అధ్యక్షతన సంక్షేమ సంబురాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూ.2016 పింఛన్ ఇస్తున్నారని తెలిపారు. మండలంలోని 7,084 మంది ఆసరా పింఛన్ లబ్ధిదారులకు ఇప్పటి వరకు రూ.100 కోట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రూ.13.12 కోట్లు కల్యాణలక్ష్మి కింద చెక్కులు, రైతు బంధు కింద రూ.19.50 కోట్లు అందించినట్లు వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో సాగునీటి సమస్య తొలిగిపోయిందన్నారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన జలాలను అందిస్తున్నట్లు తెలిపారు. కులవృత్తులను ఆదుకోవడానికి బీసీ కార్పొరేషన్ ద్వారా లక్ష రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 88 మందికి కల్యాణలక్ష్మి, 16 మందికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్, తహసీల్దార్ చలమల్ల రాజు, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్

ఐనవోలు: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా పీడీయాక్ట్‌లు నమోదు చేస్తామని ఏఓ కవిత హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం విత్తన దుకాణాల డీలర్లకు విత్తనాల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విత్తన దుకాణదారులు స్టాక్ రిజిస్టర్‌ను ఉపయోగించాలని సూచించారు. విత్తనాల వివరాలు, పీసీలు, బిల్లు బుక్‌లు ఖచ్చితంగా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. రైతులకు విక్రయించిన విత్తనాలకు రసీదు ఇవ్వాలని, అందులో విత్తన కంపెనీ పేరు, లాట్ నంబర్, తయారీ నెల, గడువు తీరే నెల స్పష్టంగా రాసి ఇవ్వాల్సిన బాధ్యత డీలర్లకు ఉందన్నారు. రైతులకు కనబడేలా బోర్డు మీద రేట్లు రాసి పెట్టాలని, విత్తనాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముకోవాలనే ప్రయత్నం చేయకూడదన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్లు మాత్రమే విత్తనాలు విక్రయించాలని, ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేట్లకు విక్రయించవద్దన్నారు. తమ స్వలాభాల కోసం గుర్తింపు లేని కంపెనీల విత్తనాలు విక్రయించి రైతులను నష్టాల్లో నెట్టవద్దని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు

మడికొండ: డంపింగ్‌యార్డ్ నుంచి వెలువడుతున్న పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మడికొండ శివారులోని డంపింగ్‌యార్డును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డులోని చెత్తను రీసైక్లింగ్ చేయకుండా తగులబెట్టడంతో భారీగా పొగ వ్యాపిస్తోందని తెలిపారు. వ్యర్థాల నుంచి వచ్చే నీరు.. వడ్డేపల్లి చెరువులో కలుస్తోందని వాపోయారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, కుర్ల మోహన్, కుక్కల సమ్మయ్య, నీలం వేణు, దువ్వ విజయ్, వస్కుల నాగరాజు, గడుసు రాజు, రఘు, శ్రీకాంత్, రమేష్, సంపత్‌రెడ్డి, రాజు, స్వామి, తిరుపతి, ఉదయ్, వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం


సదస్సులో మాట్లాడుతున్న జేబీ.రాజు

నయీంనగర్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని భారత్ బచావో హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల బాధ్యులు సూచించారు. దేశంలో బీజేపీ మతోన్మాదం, ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా భారత్ బచావో ఇరు జిల్లాల శాఖల ఆధ్వర్యంలో భారత్ బచావో సదస్సును హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో హనుమకొండ జిల్లా బాధ్యుడు సిద్దోజు రామబ్రహ్మం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త జేబీ.రాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తెరచాటు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. విద్యా పరిరక్షణ వేదిక జాతీయ నాయకుడు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పెను ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ బచావో రాష్ట్ర కమిటీ చైర్మన్ జహీరొద్దీన్ అలీఖాన్ మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీ హక్కులను కాలరాస్తున్న బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ హిందూత్వ, మతోన్మాదాన్ని ఓడించడానికి అన్ని లౌకిక శక్తులు ఏకం కావాలని కోరారు. సదస్సులో భారత్ బచావో నాయకులు ఎం.వెంగళ్‌రెడ్డి, డి.ప్రవీణ్‌కుమార్, గంటా రామిరెడ్డి, మెట్టు రవీందర్, రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయిని విద్మహే, సోమయ్య, సురేందర్, జైసింగ్‌రాథోడ్, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

వందఫీట్ల రోడ్డు పనులు పూర్తిచేయాలి

హన్మకొండ: కాకతీయ యూనివర్శిటీ – ఫాతిమానగర్ వంద ఫీట్ల రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి రాకపోకలను పునరుద్ధరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు 3వ బహిరంగ లేఖను రాకేష్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోడ్డులో నిర్మిస్తున్న డక్ట్ అండ్ డ్రైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి.. రెండేళ్లవుతున్నా ఇంకా పూర్తి చేయలేదని ఎద్దేవాచేశారు. దాంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెండేళ్లుగా రోడ్డును మూసివేయడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయని అన్నారు.

‘విద్య’ను పకడ్బందీగా అమలుచేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య హనుమకొండ జిల్లా కమిటీ బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఎండీ.అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ విభాగం బాధ్యురాలు మాస్ సావిత్రి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజులో 25శాతం, జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు రామ్‌మోహన్, పిట్టల సాయికుమార్, రవికిరణ్, మోహన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను గిరిజన జాబితాలో చేర్చొద్దు

హన్మకొండ చౌరస్తా: గిరిజనులను విచ్ఛిన్నం చేసేందుకు 11బీసీ కులాలను గిరిజన జాబితాలో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్ అన్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35లక్షల జనాభా గల 11బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఈనెల 20వ తేదీన చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ధర్నాకు గిరిజనులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

పైపులైన్ లీకేజీలతో తాగునీరు వృథా



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ తిలక్‌రోడ్డులో పైపులైన్ల లీకేజీల కారణంగా గత కొన్ని నెలలుగా గంటల తరబడి తాగునీరు వృథా అవుతోంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాశిబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో భారీగా తాగునీరు నేలపాలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దాంతో నల్లాల ద్వారా సరిపడా నీరు రావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి లీకేజీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కరీమాబాద్‌లో ‘బడిబాట’


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

కరీమాబాద్: జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ దుర్గం రవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ఇల్లిల్లు తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. విద్య ప్రాముఖ్యతను వివరించారు. కురుమవాడ, శివాలయం ప్రాంతాల్లో పర్యటించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉంటోందని తెలిపారు. ఈక్రమంలోనే 10 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు.

శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ: మండలంలోని పులిగిల్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శుక్రవారం తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లులతో కలిసి పరకాల ఎమ్మెల్యే చలాల్ ధర్మారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరేకులస్తుల సంక్షేమ కోసం తన వంతు సాయం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. పులిగిల్లలో కమ్యూనిటీ భవనాన్ని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని కులాలు, మతాలను ఆదరించిన గొప్ప వ్యక్తి శివాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ సుమలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, ఆరె సంక్షేమ సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

అమరవీరుల జిల్లాగా ప్రకటించాలి


మద్దతు తెలుపుతున్న సంఘం నాయకులు

పరకాల: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద తాలుకాగా కొనసాగుతున్న పరకాలను రాష్ట్ర ప్రభుత్వం అమరవీరుల జిల్లాగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి డిమాండ్ చేశాడు. బీజేపీ ఆధ్వర్యంలో పరకాల జిల్లా సాధన సమితి చేస్తున్న పోరాటానికి శుక్రవారం తాపీ మేస్త్రీల సంఘం మద్దతు తెలిపింది. పట్టణంలోని అమరధామంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి సమక్షంలో లిఖిత పూర్వకంగా సంఘీభావ పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిక్షపతి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యేకు పరకాల ప్రాంత అభివృద్ధిపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి జిల్లాను సాధించేవారని విమర్శించారు. కేవలం కుర్చీ కోసం రాజకీయం చేస్తూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, లేని పక్షంలో ప్రజా సంఘాల మద్దతుతో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త బిక్షపతి, సాధన సమితీ కన్వీనర్ వెంకటస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి బాలాజీ వేణుగోపాల్, శ్రీనివాస్, బిక్షపతి, సమ్మయ్య, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, కౌన్సిలర్ పూర్ణచారి, నాయకులు పాల్గొన్నారు.

బీసీబంధు రూ. 10 లక్షలు ఇవ్వాలి


మాట్లాడుతున్న నాయిని భరత్

పరకాల: రాష్ట్రంలోని బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీబంధు పథకం ద్వారా రూ. 10లక్షలు అందించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాయిని భరత్ డిమాండ్ చేశారు. ప్రతీ బీసీ కుటుంబానికి రూ.10 లక్షల బీసీబంధు అందించి ఆదుకోవాలని కోరారు. పరకాల పట్టణంలోని అమరధామంలో శుక్రవారం జరిగిన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి దేవేందర్, బీసీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్‌రావులతో కలిసి హాజరయ్యారై మాట్లాడారు. బీసీబంధు పేరుతో తెలంగాణ ప్రభుత్వం రూ.1లక్ష ఋణం ఇవ్వడం అన్యాయం అన్నారు. ఏదైనా చిరువ్యాపారం పెట్టుకోవాలన్నా ముడిసరు కొనుగోలుకు లక్ష రూపాయలు ఎం సరిపోతాయని ప్రశ్నించారు. గతంలో 9లక్షల మంది బీసీ కార్పొరేషన్ ఋణాల కోసం దరాఖస్తు చేసుకుంటే పట్టించుకోని ప్రభుత్వం ఎన్నికలు దగ్గరపడుతుంటే మళ్లీ మాయమాటలు మొదలు పెట్టిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు లోకెటి నగేష్, రాజేశ్వర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వారంలో 5రోజులు ప్రజలకు అందుబాటులో..


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన చీఫ్ విప్

కాజీపేట: పట్టణంలోని ప్రజలకు వారంలో అయిదు రోజుల పాటు అందుబాటులో ఉండడానికి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని స్థానికంగా ప్రారంభించినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. కాజీపేట పట్టణంలోని డీమార్ట్ పక్కన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా మూడు గంటల పాటు కాజీపేట పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు సుంచు కృష్ణ, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, సుంచు అశోక్, బీఆర్ఎస్ నాయకులు బస్వ యాదగిరి, మిట్టపల్లి రవిందర్, బి.రంజిత్ కుమార్, ఎండీ.సోని, పి.శివకుమార్, తేలు సారంగపాణి, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కరీమాబాద్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సంక్షేమ దినోత్సవ సంబరాలను మామునూరు హెచ్ఆర్ఎస్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 159 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 25మందికి రూ.10 లక్షల 47 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే, 6 యూనిట్ల గొర్రెలు, ముగ్గురికి బీసీ రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్ల కరుణాకర్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం



కాజీపేట రూరల్: వరంగల్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి.సాంబశివరావు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్‌లో ఈనెల 6, 7, 8వ తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించి అనంతరం రైలులో కాజీపేట జంక్షన్‌కు శుక్రవారం చేరుకున్న క్రీడాకారులకు సాంబశివరావు ఆధ్వర్యంలో పలువురు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోచ్ విజయ్‌ను జాతీయ స్థాయి క్రీడాకారులు తాబేటి శ్రీకరణ్, అఖిల్, విష్, విరి, విల్లునందన్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాబేటి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.